## క్లుప్తంగా

### గణపవరం విద్యార్థులకు కలెక్టర్ బహుమతి



నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా ద్వితీయ బహుమతి, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించారు. షేక్ షాహీనా, ఆర్.హారిక, పి.మహేశ్వరి జట్టు ద్వితీయ స్థానం సాధించారు. గురువారం కలెక్టర్ విద్యార్థులకు బహుమతి అందించారు. విద్యార్థులకు మార్గ నిర్దేశం చేసిన ఉపాధ్యాయులు బాజీరావు, కృష్ణానాయక్‌లను అభినందించారు.

### రేపు మున్సిపల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

### వస్తు విక్రయ వేలం పాట

బొల్లాపల్లి: మండలంలోని రావులాపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మన్నేపల్లి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంకు చెందిన వస్తు విక్రయ వేలం పాట ఈ నెల 27న వినుకొండ పట్టణంలోని శ్రీ ప్రసన్న రామలింగేశ్వర కోదండ రామస్వామి దేవాలయంలో నిర్వహిస్తామని దేవదాయ శాఖ అధికారి బి.శ్రీనివాసులు గురువారం తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరునాళ్ల జరుగుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించి దేవస్థానం ప్రాంగణంలో కొబ్బరికాయలు అమ్ముకునేందుకు రూ.10 వేలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు, లడ్డూ ప్రసాదం అమ్ముకునేందుకు రూ.5 వేలు వంతున దరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

### ఎమ్మెల్యేకు సెర్ప్ సిబ్బంది వినతి

ఈపూరు : సెర్ప్ సిబ్బంది సమస్యలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈపూరు ఏపీఎం పి.వి.రంగారెడ్డి, సెర్ప్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

### టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి..



వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గంలోని శావల్యాపురం మండలం పిచికలపాలెం గ్రామం నుంచి 20 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు యువనాయకులు బి.గిరిబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గ్రామానికి చెందిన అమృతపూడి యోగయ్య, వెంకయ్య, పిచ్చయ్య, ఆధ్వర్యంలో పలు కుటుంబాలు పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, స్థానిక ఎమ్మెల్యే బొల్లా అభివృద్ధిని చూసి పార్టీలో చేరామని వారు తెలిపారు. కార్యక్రమంలో వినుకొండ ఎంపీపీ జయశ్రీ వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మి రాజా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

### మహిళ ఆత్మహత్య



శావల్యాపురం: మండల పరిధిలోని మతుకుమల్లి గ్రామంలో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం వెలుగుచూసింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని చింతలబీడు బీసీ కాలనీకి చెందిన సీహెచ్ జ్యోతి ప్రసన్న (38) బుధవారం సాయంత్రం చీరతో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఉదయం సమాచారం తెలుసుకున్న ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, సీడీపీవో ముదివర్తి అనురాధ, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత పంచాయతీ కార్యదర్శి సూరిబాబు నివాళి అర్పించారు. వ్యక్తిగత కారణాల వల్లే జ్యోతి ప్రసన్న ఆత్మహత్యకు పాల్పడినట్లు కుమారులు వెల్లడించారు. ఆమె గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తోంది.

### 29 నుంచి విద్యుత్‌శాఖపై ప్రజాభిప్రాయ సేకరణ

నరసరావుపేట: స్థానిక బరంపేటలోని విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయంలో ఏపీసీపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈనెల 29, 30, 31 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బహిరంగ ప్రజాభిప్రాయసేకరణ నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.శ్రీనివాసరావు వెల్లడించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీసీపీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో 2024–25 ఆర్థిక ఏడాదికి ప్రతిపాదించిన డిస్కం వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై వినియోగదారుల నుంచి అభిప్రాయాలు తీసుకోవటం జరుగుతుందన్నారు. వీడియా కాన్ఫరెన్స్ ద్వారా విశాఖపట్టణం నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

- శావల్యాపురం తహసీల్దారు నాగరాజు
- వేర్వేరు ప్రాంతాల్లో ఘనంగా ఓటర్ల దినోత్సవం

శావల్యాపురం: ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధంతో సమానమని తహసీల్దారు వేముల వెంకట నాగరాజు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. భారతదేశంలో 1950 జనవరి 25న ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన సందర్భంగా నేషనల్ ఓటర్స్ డేను అధికారికంగా నిర్వహించుకోవటం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఓటరు దినోత్సవం ప్రధాన లక్ష్యం 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులను నూతన ఓటరుగా నమోదు చేయటం ద్వారా వారి ప్రజాస్వామ్యంలో భాగస్వాములను చేయటం జరుగుతోందన్నారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలు ఉండగా 34 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోల సారథ్యంలో ఇరుపార్టీల నాయకులు ప్రజల చేత ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు పేరిసోముల నానయ్య, వీఆర్వోలు వీరపల్లి నాగ సంతోష లక్ష్మి, అమల, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

**నూజెండ్లలో...**

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల ఎంపీడీవో కార్యాలయం వద్ద జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో టి.వీరభద్రాచారి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ విలువైన ఓటుతో మంచి పరిపాలన అందించే నాయకులను ఎన్నుకోవాలన్నారు. అనంతరం ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. అదేవిధంగా నూజెండ్ల జడ్పీహెచ్ పాఠశాలలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించి ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే ఓటరు ప్రతిజ్ఞ చేయించారు.

**ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది ఓటు**

యడ్లపాడు: ఓటు ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అని తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు తెలిపారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని యడ్లపాడు లూథరన్ హైస్కూల్ ఆవరణలో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం గురువారం జరిగింది. రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పిడతల రూసీసాగర్ హాజరై మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు, దాని ప్రాధాన్యత, సద్వినియోగం తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. 1950 నుంచి గణతంత్ర దినోత్సవం ముందురోజు జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించుకున్నట్లు తెలిపారు. అనంతరం సీనియర్ ఓటరును సత్కరించారు. డీటీ శ్యామలా, ఆర్ఐ చక్రవర్తి, ఈవోపీఆర్డీ వరూధిని, ఎంఈవో-1 నాగరత్నం, ఐసీడీఎస్ యడ్లపాడు సెక్టార్ సూపర్‌వైజర్ వెంకట రమణ, కార్యదర్శి శశికళ, హెచ్‌ఎం బీఎస్ పద్మలత, వీఆర్వోలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కారుమంచి పోలింగ్ కేంద్రంలో ప్రతిజ్ఞ కార్యక్రమం పాల్గొన్న ప్రజాప్రతినిధులు

**ఓటును సక్రమంగా వినియోగించుకోవాలి**

నాదెండ్ల: ఓటు హక్కును సక్రమమంగా సద్వినియోగం చేసుకుని విలువలు కలిగిన నాయకులను ఎన్నుకోవాలని ఎంపీపీ తలతోటి రాజీ, జెడ్పీటీసీ మస్తాన్‌రావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంతో పాటూ గ్రామాల్లోన్ని అన్ని సచివాలయాల్లో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ముందుగా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో కలిసి ఓటుహక్కు ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ప్రలోభాలకు, కులమత దురభిమానాలను లొంగకుండా నిజాయితీగా, వివేకంతో ఆలోచించి ఓటేయాలన్నారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎ కృష్ణానాయక్ అధ్యక్షతన జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ముగ్గులపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, ఎంఈవో అంజనేయులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



యడ్లపాడులో సీనియర్ ఓటరును సత్కరిస్తున్న తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు

**బొల్లాపల్లిలో...**

బొల్లాపల్లి : ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ ఎస్.దుర్గేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లో జాతీయ ఓటరు దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు డే ప్రతిజ్ఞ చేయించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటు హక్కుతో స్వచ్ఛమైన పాలన అందించే దిశగా ఓటరు అడుగువేయాలన్నారు. అనంతరం సీనియర్ ఓటర్లకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో -2 కె.పార్వతి, వీఆర్వో బి.శ్రీనునాయక్, గ్రామపెద్దలు, ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

**నరసరావుపేటలో...**

నరసరావుపేట ఈస్ట్: రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం పట్టణంలోని పలు కళాశాలల్లో ఘనంగా నిర్వహించి ఓటు ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. కె.ఆర్.జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నీలావతిదేవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాలు వయస్సు నిండిన యువత తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను తెలియచేశారు. మద్యం, డబ్బు, కులం వంటి వాటికోసం పవిత్రమైన ఓటును దుర్వినియోగం చేయవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ జాయింట్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాస ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నూజెండ్ల ఎంపీడీవో కార్యాలయం వద్ద ఓటరు డే ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

**ఎస్ ఎస్ అండ్ ఎన్ కళాశాలలో....**

జాతీయ ఓటరు దినోత్సవాన్ని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. యువత తప్పనిసరిగా ఓటు కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఏ.సరళాదేవి, రాజనాల వేణుమాధవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

**ప్రతి పౌరుడు ఓటు హక్కు కలిగి ఉండాలి**

చిలకలూరిపేటటౌన్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని చిలకలూరిపేట తహసీల్దార్ జి.సుజాత చెప్పారు. మండలంలోని మద్దిరాల గ్రామంలో జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు.

ఓటు హక్కు దుర్వినియోగం చేసుకుంటే ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని చెప్పారు. ప్రతి పౌరుడు ఓటు హక్కు పొందే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశమని తెలిపారు. ప్రజాస్వామ్యంపై యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో లోక్ సత్తా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎం. భానుప్రసాద్, ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు, విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు పాల్గొన్నారు.

### ఓటు హక్కు సామాజిక బాధ్యత

చిలకలూరిపేట: ఓటు హక్కు ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి జి.వసంతబాబు తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. పల్నాడు జిల్లా వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం ఆధ్వర్యంలో ముద్రించిన 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వసంతబాబు మాట్లాడుతూ ఓటు దేశ భవిష్యత్‌ను నిర్దేశిస్తుందన్నారు. ఓటు అభివృద్ధికి నాంది పలుకుతుందని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా ఓటర్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.సుజాత, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, యడ్లపాడు, నాదెండ్ల మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



చిలకలూరిపేట ర్యాలీలో పాల్గొన్న జి.వసంత బాబు, ఇతర అధికారులు



నాదెండ్ల ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ రాజీ, జెడ్పీటీసీ మస్తాన్‌రావు



బొల్లాపల్లిలో సీనియర్ ఓటర్లకు సన్మానం చేస్తున్న తహసీల్దార్, రెవెన్యూ అధికారులు




నరసరావుపేటలో జరిగిన ఓటరు దినోత్సవంలో మాట్లాడుతున్న నీలావతిదేవి



చిలకలూరిపేటలో మాట్లాడుతున్న తహసీల్దార్ జి.సుజాత

# జగనన్న హయాంలోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- కొచ్చర్లలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు ఆరంభం

ఈపూరు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే ప్రతిగ్రామం అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వెల్లడించారు. మండలంలోని కొచ్చర్ల గ్రామంలో గ్రామసచివాలయం, రైతు భరోసా కేంద్ర నూతన భవనాలను, అంగన్‌వాడీ సెంటర్లను ఆయన గురువారం ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో తాగునీటి అవసరాల కోసం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి రోజురోజుకు ముందుకు పోతోందని, ఇలాంటి అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు పిచ్చిపట్టినట్లు ఆరోపణలు చేస్తున్నారని, ఆరోపణలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ వంటి పక్కా భవనాలను నిర్మించి వాటి ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. నేడు ఏ పని కావాలన్నా ప్రజలు తమ గ్రామంలోనే చేయించుకోవచ్చని, ఒకప్పుడు రైతు విత్తనాల కోసం, ఎరువుల కోసం కిలోమీటర్ల కొద్ది పోవాల్సి వచ్చేదని, ప్రస్తుతం గ్రామంలోనే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంటున్నాయని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి గ్రామ పరిపాలన వ్యవస్థను తీసుకొచ్చి 1.30 లక్షలకు పైగా ఉద్యోగాలను కల్పించారన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరికీ నవరత్న పథకాలు అందాలని నేరుగా వారి ఖాతాల్లోకే డబ్బులను జమ చేస్తున్నామన్నారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలు గమనించి ప్రజామద్దతు తెలపాలని కోరారు. అనంతరం నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు రూ.3 వేలు చొప్పున ఎమ్మెల్యే అందజేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు


**జీవీది చీకటి రాజ్యం...**

పది సంవత్సరాలు ప్రజలు అధికారం ఇస్తే మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వారి విలాసాలకు పదవిని వాడుకున్నారని, ప్రజలకు ఒక్కటంటే ఒక్కటి చెప్పుకోదగిన అభివృద్ధి చేసిన పాపాన పోలేదని ఎమ్మెల్యే బొల్లా విమర్శించారు. అలాగే రైతులను కూడా వారి మాయపు కంపెనీల ద్వారా మట్టికి రంగు వేసి ఎరువు అని చెప్పి అమ్మి రైతులను మోసం చేసిన నీచ బతుకు జీవీ ఆంజనేయులుదని అన్నారు. తెలుగుదేశం పాలన వస్తే రౌడీరాజ్యంగా మార్చి ఊరి మీద పడి దోచుకునేలా వీలు కల్పిస్తామని జీవీ ఆంజనేయులు వారి పార్టీ నాయకులకు, కార్యకర్తలతో అంటున్నారని అన్నారు. ప్రజలు గమనించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్, మండల పార్టీ అధ్యక్షులు కోపెల దేవరాజ్, గోలి వెంకటేశ్వర్లు, శాకమూరి బుచ్చయ్య, గోలి ఏడుకొండలు, గోనుగుంట్ల వెంకట హనుమయ్య, సొసైటీ అధ్యక్షులు బొల్లా బుజ్జి, రామారావు, కొండవర్లు నాగేశ్వరరావు, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏ గన్నవరం వాడో!?

- యడ్లపాడులో కారు ఢీకొని దుర్మరణం
- ఎక్కడివాడన్నది అర్థంకాక పోలీసులు తికమక
- ఆచూకీ తెలపాలంటూ వినతి

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన యడ్లపాడు మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...తిమ్మాపురం పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారిని దాటుతున్న క్రమంలో ఓ వ్యక్తిని చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు ప్రయాణిస్తున్న కారు ఢీకొంది. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న 108 వాహన సిబ్బంది చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడు తన వివరాలను వైద్యులకు చెప్పి స్పృహ కోల్పోయాడు. చికిత్స పొందుతూ ఆదేరోజు రాత్రి మృతి చెందాడు. మృతుడు గన్నవరం గ్రామానికి చెందిన సోమరాజు అని, తనతండ్రి లింగయ్య అని చెప్పాడు. అయితే జిల్లా పేరు చెప్పకపోవడంతో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో గన్నవరం పేరుతో మూడు గ్రామాలు ఉండటంతో పోలీసులకు మృతుడి వివరాలు తెలియరాలేదు. ఆచూకీ తెలిసిన వారు సెల్ నం: 94407 96256కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్ కోరారు.



మృతుడు సోమరాజు

# అవగాహన ర్యాలీలో భాగస్వాములు కావాలి

**ఆర్ఎంపీ, పీఎంపీ రాష్ట్ర ఐక్యవేదిక సంఘం పిలుపు**

యడ్లపాడు: పట్టణ, గ్రామీణ వైద్యుల ఐక్యవేదిక సంక్షేమ సంఘం (ఆర్ఎంపీ, పీఎంపీ) ఆధ్వర్యంలో క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీలో రాష్ట్రంలోని సంఘం సభ్యులంతా హాజరై విజయవంతం చేయాలని సంఘం పిలుపునిచ్చింది. యడ్లపాడులో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి జి మురళీకృష్ణ నేతృత్వంలో గురువారం సన్నద్ధ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 4వ తేదీన ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం రోజున గుంటూరు జిల్లా సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రి నుంచి వికాస్ హాస్పిటల్ వరకు భారీ అవగాహన ర్యాలీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ ర్యాలీలో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. అలాగే కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పలుశాఖల అధికారులు పాల్గొంటారని వివరించారు. క్యాన్సర్ నిర్మూలన ధ్యేయంతో ప్రజాచైతన్యం కలిగించే ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంఘం సభ్యులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు పి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు మనోహర్, వేజెండ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి వి.రాము, జిల్లా కోశాధికారి బందారు శ్రీనివాసరావు, ఉపకార్యదర్శి కె.లక్ష్మీకుమారి, కార్యవర్గ సభ్యులు షేక్ నీలకమల్, రాష్ట్ర సంఘం కోశాధికారి జి సాంబశివరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐక్యవేదిక సంఘం నాయకులు

### పాఠశాలకు ఉపకరణాలు వితరణ



బొల్లాపల్లి: స్నేహ హస్తాల ఫౌండేషన్ పాఠశాలలకు వితరణ విద్య ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ కోఆర్డినేటరు కరీముల్లా బాబు మాట్లాడుతూ పాఠశాలలకు ఫౌండేషన్ చేయూత నందిస్తుందని తెలిపారు. మండలంలోని 25 పాఠశాలలకు వితరణగా విద్యార్థులకు ఆట వస్తువులు, నోట్ బుక్స్, స్టేషనరి తదితర వస్తువులు అందజేశామని తెలిపారు.

### సత్తాచాటిన మహిళ ఖోఖో టీం



ఈపూరు: వినుకొండలో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీల్లో మహిళల ఖోఖో విభాగంలో కొండాయపాలెం జట్టు ప్రథమ స్థానం పొందింది. వినుకొండ స్పెషల్ ఆఫీసర్ శ్రీరాములు, తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ పి. వెంకయ్య, ఎంఈవో జుఫ్రుల్లా, ఎంపీడీవో సుందరరెడ్డి, ఆటల పోటీల కోఆర్డినేటర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**■ బాధ్యతలు స్వీకరించిన రూరల్ సీఐ**

నరసరావుపేట రూరల్: నరసరావుపేట రూరల్ సీఐగా కె.మల్లికార్జున గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గుంటూరు నగరంపాలెం సీఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన సీఐ కృష్ణయ్య ఇటీవల జరిగిన బదిలీల్లో అద్దంకి స్టేషన్‌కు సీఐగా బదిలీ అయ్యారు.

**■ అక్రమ మద్యం కేసులో నిందితుడు అరెస్ట్**

నరసరావుపేటటౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 16 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార గురువారం తెలిపారు. నకరికల్లు మండలం కండ్లకుంట గ్రామంలో దాడులు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కాట్రగడ్డ వెంకట్రావును అరెస్ట్ చేశామన్నారు.

**■ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు**

నాదెండ్ల: జంగాలపల్లి, తూబాడు గ్రామాల మధ్యలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని నాదెండ్ల పోలీసులు గురువారం అరెస్టు చేశారు. తూబాడు సమీపంలో అతన్ని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 16 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు.

**■ చికిత్స పొందుతూ యువకుడి మృతి**

నరసరావుపేటటౌన్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. సత్తెనపల్లిరోడ్డు రామ్‌నగర్ కాలనీకి చెందిన యడ్ల అశోక్‌కుమార్ (32) మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు 108 సాయంతో ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడు ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.

**■ అభివృద్ధి భారతం**

బొల్లాపల్లి: మండల కేంద్రంలో వికసిత భారత సంకల్ప యాత్ర గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌కె జిలానీ బాషా మాట్లాడుతూ అభివృద్ధి చెందిన భారత దేశం సంకల్పం అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 కె పార్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు వి శ్రీదేవి పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పెద్దలు పి నారాయణరెడ్డి, జి యాకోబ్, మేడం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**■ ఘనంగా జాతీయ బాలికాదినోత్సవం**

చిలకలూరిపేటటౌన్: విద్యార్థినులు క్రమశిక్షణతో ఉన్నత చదువులు అభ్యసించి సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఇన్నర్‌వీల్ క్లబ్ డిస్ట్రిక్ అధ్యక్షురాలు మార్నెళ్ల ఇందిరా చెప్పారు. గురువారం మండలంలోని పసుమర్రు గ్రామంలోని మద్ది కామయ్య జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఇన్నర్‌వీల్ క్లబ్ 100 సంవత్సరాలు పూర్తి అయిన నేపథ్యంలో పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 100 స్కూల్ బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో చిలకలూరిపేట ఇన్నర్‌వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు దండా విజయశ్రీ, తోట శివకుమార్, శంకరరావు, అప్పారావు, పాల్గొన్నారు.

**■ జాతీయ తైక్వాండో పోటీలకు..**

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థిని ఎం.ఎం.అంజనీసాయిలక్ష్మీ ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య గురువారం తెలిపారు. నంద్యాలలో ఈనెల 20, 21తేదీలలో నిర్వహించిన తొలి ఓపెన్ ఏపీ స్టేట్ మహిళా తైక్వాండో టోర్నమెంట్‌లో సాయిలక్ష్మీ 46 కేజీల విభాగంలో రజిత పతకం సాధించి ఫిబ్రవరి 1, 2 తేదీలలో చత్తీస్‌గడ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. అలాగే మరో విద్యార్థిని వి.తులసీ తన్మయ్ 53 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించిందని తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థినులను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ మధుసూధనరావు అభినందించారు.

**■ వర్సిటీ బాల్‌బాడ్మింటన్ టీంకు కేబీఆర్ విద్యార్థి**

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బాల్ బాడ్మింటన్ టీంకు కాను బ్రహ్మానందరెడ్డి కళాశాల విద్యార్థి వి.వెంకట లక్ష్మీనారాయణ ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్.వి.నాగిరెడ్డి గురువారం తెలిపారు. ధనలక్ష్మీ వ్యాయామ కళాశాలలో ఈనెల 23వ తేదీన నిర్వహించిన వర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల బాల్ బాడ్మింటన్ పోటీలలో కె.బి.ఆర్. కళాశాల జట్టు రన్నరప్‌గా నిలవటంతో పాటు లక్ష్మీనారాయణ వర్సిటీ జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. త్వరలో నిర్వహించనున్న జాతీయస్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల బాల్ బాడ్మింటన్ పోటీలలో లక్ష్మీనారాయణ ఏఎన్‌యు జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తాడని తెలిపారు.